సాక్షి ఒడిశా
శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,08,755లు, బంగారం 30 మిల్లీగ్రాములు వెండి 5గ్రాములు 250 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

రాష్ట్రవ్యాప్తంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు.

- 9లో



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల సమితిలో గురువారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు.

- 9లో

న్యూస్‌రీల్

14 మంది నిందితులు అరెస్టు

రాయగడ: స్థానిక అటానమస్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులపై దాడి కేసుకు సంబంధించి సదరు పోలీసులు 14 మందిని బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. ఇటీవల కళాశాలలోకి ఆకతాయిలు చొరబడి విద్యార్థులపై దాడి చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత షరఫ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీస్ యంత్రాంగం ఈ మేరకు చర్యలు తీసుకుంది. అసలు విద్యార్థులపై దాడి చేయాల్సిన అవసరం ఏముంది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో ప్రసవం



జన్మించిన ఆడ శిశువు

రాయగడ: నవరంగపూర్ నుంచి పర్లాకిమిడి వైపు వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సులో మహిళ ప్రసవించింది. వివరాల్లోకి వెళ్తే.. గుణుపూర్‌లోని తన బంధువుల ఇంటికి వినాయక చవితికి వెళ్లేందుకు ఒక నిండు గర్భిణి నవరంగపూర్ నుంచి పర్లాకిమిడి వైపు వెళ్లే ప్రైవేట్ బస్సులో ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో గజపతి జిల్లా కాశీనగర్‌కు బస్సు చేరుకునేసరికి పురిటి నొప్పులు రావడంతో వేదన పడింది. అదే సమయంలో ఆ బస్సులో ప్రయాణిస్తున్న ఒక ఆరోగ్య కార్యకర్త ఇది గమనించి ప్రసవానికి సమయమయ్యిందని, అందుకు అంతా సహకరించాలని కోరారు. దీంతో బస్ డ్రైవర్ కాసీనగర్ ప్రాంతంలో బస్ నిలిపాడు. బస్ సిబ్బంది, ప్రయాణికులు బస్సు నుంచి దిగిపోయారు. కొద్ది నిమిషాల తర్వాత గర్భిణి ఒక ఆడ శిశువుకి జన్మనిచ్చింది. అనంతరం బస్ డ్రైవర్ వెంటనే బస్‌ను గుణుపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి సమాచారం అందించడంతో వైద్య సిబ్బంది తల్లి, బిడ్డకు చికిత్స అందజేశారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి బాగుందని తెలిపారు. అయితే ప్రసవించిన మహిళ వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళల భద్రతకు కఠిన చట్టాలు

- అసెంబ్లీలో విపక్షాల డిమాండ్

భువనేశ్వర్: రాష్ట్రంలో మహిళల భద్రతకు కఠిన చట్టాలు తీసుకు రావాల్సిన అవసరం ఉందని విపక్షాలు బిజూ జనతా దళ్, కాంగ్రెస్ సభ్యులు అసెంబ్లీలో గురువారం డిమాండ్ చేశారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటన తర్వాత పశ్చిమ బెంగాల్‌లో కఠిన చట్టాన్ని తీసుకొచ్చారని తెలియజేశారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలతో సహా నేరాలను అరికట్టేందుకు ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోనూ ఇలాంటి చట్టాన్ని తీసుకురావాలని బీజేడీ నాయకురాలు, అసెంబ్లీలో ప్రతిపక్ష చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ కోరారు. ఒడిశాలో మహిళలు, పిల్లలకు భద్రత లేదని రాష్ట్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ సీనియర్ నేత జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి, కటక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సోఫియా ఫిర్దౌస్ అన్నారు. మహిళలపై నేరాల కేసుల్లో సకాలంలో న్యాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిబంధనలతో కూడిన కొత్త చట్టాన్ని తీసుకురావాలన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఎమ్మెల్యే దాశరథి గొమాంగో



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పర్లాకిమిడి: విద్యార్థులు ఉన్నతంగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో ఆకాంక్షించారు. స్థానిక గజపతి స్టేడియంలో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన ఇద్దరు ఆదివాసీ విద్యార్థులు సివిల్ సర్వీసులకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు గొప్పగా చదువుకొని సీఎం స్కాలర్‌షిప్స్ పొందాలని సూచించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. సీఎం మోహన్ చరణ్ మాఝీ భువనేశ్వర్‌లో ఆవిష్కరించిన శిక్ష పురస్కార్, స్కాలర్ షిప్స్ పథకాలను వర్చువల్ విధానంలో వీక్షించారు. కార్యక్రమంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, కలెక్టర్ బిజయ కుమార్ దాస్, డీఈవో డా.మాయాధర్ సాహు, డీఆర్‌డీఏ సీడీఎం గుణనిధి నాయక్, అదనపు డీఈవో మనోరంజన్ దొళాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల జీతభత్యాలు పెంచాలి

- ఎమ్మెల్యే తారాప్రసాద్ ప్రతిపాదన
- ప్రతిపాదనకు వివిధ పార్టీల మద్దతు



జీతభత్యాలు పెంచాలని మాట్లాడుతున్న జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి

భువనేశ్వర్: ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేల జీతభత్యాలు, పింఛన్‌ను పెంచే బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టాలని కాంగ్రెసు ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి కోరారు. ఈ మేరకు ఆయన ప్రతిపాదనకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు సభలో మద్దతు ప్రకటించారు. శూన్య గంటలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ ప్రతిపాదనకు బీజేడీ అభ్యర్థి అశ్విని పాత్రో, బీజేపీ అభ్యర్థి సనాతన్ బిజులీ మరియు ఇతర పార్టీల సభ్యుల నుంచి విస్తృత మద్దతు లభించింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పాటు నియోజకవర్గాల్లో ప్రజలు ఆశించిన అంచనాల మేరకు క్షేత్రస్థాయి సందర్శన వంటి పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుత జీతభత్యాలతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

మెడికల్ అలవెన్స్ పెంచాలి

ప్రస్తుతం నిబంధన ప్రకారం ఆరోగ్య సంరక్షణ ఖర్చుల కోసం నెలకు రూ.2,000 మాత్రమే మంజూరు అవుతోందని ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన కొంతమంది మాజీ ఎమ్మెల్యేలు వైద్యం కోసం చాలీచాలని ఆర్థిక ప్రోత్సాహంతో కొట్టుమిట్టాడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో ఎమ్మెల్యేల జీతభత్యాలు, పింఛన్ పెంచాలని ఒక కమిటీ ప్రతిపాదనను సమర్పించింది. గత బీజేడీ ప్రభుత్వం ఈ అంశంపై బిల్లును ప్రవేశపెట్టలేదని స్పీకర్ దృష్టికి తీసుకుని వచ్చారు. దీంతో ఈ పరిస్థితుల్లో తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి అభ్యర్థిస్తానని స్పీకర్ సురమా పాఢి సభకు హామీ ఇచ్చారు. శాసన సభ్యులు అధిక ద్రవ్యోల్బణం రేట్లు, ముఖ్యంగా పెట్రోలు మరియు డీజిల్ ధరలు పెరగడం, తమ ఆర్థిక సవాళ్లను తీవ్రతరం చేయడం ద్వారా తమ డిమాండ్‌ను సమర్థించుకున్నారు. పెరుగుతున్న ఇంధన ధరలకు అనుగుణంగా ప్రయాణ భత్యాన్ని (టీఏ) కూడా పెంచాలని కోరారు. గతంలో ప్రతిపక్ష చీఫ్ విప్‌గా పని చేసిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, అసెంబ్లీలో ప్రస్తుత మరియు మాజీ సభ్యులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించి గతంలో ఈ ప్రతిపాదనకు మద్దతు ఇచ్చినట్లు గుర్తు చేయడం గమనార్హం. ఎమ్మెల్యే వేతనాన్ని నెలకు రూ.1 లక్ష నుంచి రూ. 2.5 లక్షలకు పెంచాలని గతంలోని కమిటీ సిఫార్సు చేసిందని స్పీకర్‌కు తెలిపారు. ప్రస్తుతం ప్రతీ ఎమ్మెల్యే జీతభత్యాలు సమగ్రంగా రూ.1 లక్షకు మాత్రమే పరిమితమైనట్లు స్పష్టం చేశారు. ఇందులో రూ.35,000 జీతం కాగా, రూ.65,000 అలవెన్సులుగా పేర్కొన్నారు. సభా సమావేశాలు సందర్భంగా రోజుకు రూ.1,500 రోజువారీ భత్యం మరియు ప్రయాణ రీయింబర్స్‌మెంట్‌లు ఉన్నాయని తెలిపారు.

బర్డ్ ఫ్లూపై కేంద్ర బృందం సమీక్ష



ప్రభుత్వ అధికారులతో కేంద్ర పరిశీలన బృందం సమావేశం

భువనేశ్వర్: రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రెండు రోజుల పాటు కేంద్ర బృందం ఈ పరిస్థితిని సమీక్షించింది. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శితో బృందం సమావేశం అయింది. బర్డ్ ఫ్లూ సంక్రమణ స్థాయి నివేదికను సమర్పించింది. పూరీ జిల్లాలో తొలుత బర్డ్ ఫ్లూ తలెత్తి తీవ్రతరమైంది. ఈ నేపథ్యంలో పూరీ సర్క్యూట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్ సిద్ధార్థ్ శంకర్ స్వయి, కేంద్ర పరిశీలన బందం సభ్యులు చర్చించారు. పూరీ జిల్లాలో బర్డ్ ఫ్లూ పరిస్థితి అదుపులోనే ఉందని సమావేశం అనంతరం బృందం సభ్యులు తెలిపారు. వ్యాధి సోకిన ప్రాంతానికి ఒక కిలో మీటరు పరిధిలోని వ్యక్తులు చికెన్ తినవద్దని టీమ్ సభ్యులు సూచించారు. 10 కిలోమీటర్ల దూరంలోపు కోళ్ల ఎగుమతి, దిగుమతులపై ఆంక్షలు విధించారు. దీంతో పాటు ప్రజలకు దీనిపై అవగాహన కల్పిస్తున్నారు. వెటర్నరీ శాఖ, అటవీ శాఖ, జిల్లా పరిపాలన అధికారులు, పోలీసు అధికారులు, వైద్య బృందం సభ్యులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అంతేకాకుండా బర్డ్ ఫ్లూ సోకిన ప్రాంతాలను శానిటైజ్ చేస్తున్నారు. కేంద్ర బృందం సభ్యుడు రాంసిస్ హజేరా మాట్లాడుతూ.. పౌల్ట్రీ ఫామ్‌లు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. బర్డ్ ఫ్లూ గుర్తించే ప్రాంతం నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో బయటి నుంచి కోళ్ల రవాణా నిషేధించబడింది. ఇలా చేస్తే కొద్ది రోజుల్లోనే పరిస్థితి అదుపులోకి వస్తుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని న్యూఢిల్లీకి చెందిన కేంద్ర బృందం సభ్యుడు అభిజిత్ మిత్రా అన్నారు. మనం జాగ్రత్తలు పాటిస్తే ఈ సమస్యను అధిగమించవచ్చన్నారు.

మైనర్ బాలికల కిడ్నాప్

- వేర్వేరు ఘటనల్లో ఇద్దరు నిందితులు అరెస్టు



నిందితుడు గోపాల్ పంగి



నిందితుడు రమేష్ పంగి

జయపురం: ఇద్దరు మైనర్ బాలికలను కిడ్నాప్ చేసి, రేప్ చేసిన రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సదర్ మహిళా పోలీసు అధికారి శకుంతల దేవి గురువారం వెల్లడించారు. అరెస్టైనవారిలో నందపూర్ పోలీసుస్టేషన్ పరిధి మఝిపుట్ గ్రామానికి చెందిన గోపాల పంగి, జయపురం సమితి బరిణిపుట్‌కు చెందిన రమేష్ పంగిలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు కేసుల్లో మరో 5 మంది నిందితులు ఉన్నారని తెలిపారు. పోలీసుల వివరాల మేరకు..

బజారుకు వెళ్లిన బాలిక కిడ్నాప్

సెమిలిగుడ సమితి ప్రాంతంలో రెండేళ్ల క్రితం ఒక మైనర్ బాలిక బజారుకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఆమెను మఝిపుట్ గ్రామానికి చెందిన గోపాల్ పంగి అడ్డగించాడు. ఇంటి వద్దకు దిగబెడతానని చెప్పి బైక్‌పై ఎక్కించుకున్నాడు. అయితే ఆ బాలికను ఇంటికి తీసుకెళ్లకుండా తన ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం వివాహం చేసుకుంటానని నమ్మబలికి అత్యాచారం చేశాడు. అయితే ఎంతసేపటికీ బాలిక ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది చుట్టుపక్కల గాలించారు. 15 రోజుల అనంతరం తమ కుమార్తె గోపాల్ వద్ద ఉన్నదని తెలుసుకొని అక్కడికి వెళ్లారు. అయితే బాలికను తన భార్యగా చేసుకుంటానని వారికి తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడి వద్దనే అమ్మాయిని వదిలి వెళ్లారు. అనంతరం ఆ బాలికపై మానసిక, శారీరక వేధింపులకు గోపాల్, అతని కుటుంబ సభ్యులు పాల్పడి ఇంటి నుంచి వెళ్లగొట్టారు. దీంతో మరో దారిలేక ఆ బాలిక కన్నవారింటికి వెళ్లింది. అనంతరం మరో యువతిని వివాహం చేసుకుని గోపాల్ ఇంటికి తీసుకొచ్చాడు. ఈ విషయం తెలిసి బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి బుధవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు దర్యాప్తు అధికారి శకుంతల దేవి వెల్లడించారు.

తప్పించుకు తిరుగుతున్న నిందితుడు అరెస్టు

మరో మైనర్ బాలిక జయపురం పట్టణానికి చెందినది. 2023 ఫిబ్రవరి రెండో వారంలో మైనర్ బాలిక కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్నిచోట్ల గాలించి కనిపించకపోవడంతో, మర్నాడు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దీంతో బాలికను బరిణిపుట్‌కు చెందిన రమేష్ పంగి అపహరించి తీసుకెళ్లాడని వెల్లడైంది. పోలీసులు అతడి ఇంటికి వెళ్లి బాలికను రక్షించారు. అయితే నిందితుడు రమేషఅప్పటికే పరారయ్యాడు. అనంతరం మైనర్ బాలికకు హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు జరిపి ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. దాదాపు ఏడాదిన్నర పాటు నిందితుడు పోలీసుల కళ్లుగప్పి పరారీలో ఉన్నాడు. విశ్వసనీయ వర్గాల ద్వారా రమేష్ ఆచూకీ తెలుసుకొని ఈనెల 3వ తేదీ రాత్రి అరెస్టు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ నవీన్ చంద్ర చౌదరి గురువారం వెల్లడించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

రాయగడ: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి అండరాకంచ్ పోలీసుస్టేషన్ పరిధి శిఖాపాస్ గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి సొదా జొడియా (51)గా గుర్తించారు. గ్రామ సమీపంలోని మొక్కజొన్న తోటలో సదాజొడియా పని చేసుకుంటున్నాడు. అయితే అతని సమీపంలోనే విద్యుత్ స్తంభం నుంచి తెగిపడి ఉన్న విద్యుత్ తీగను చూసుకోకుండా తాకాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి వెళ్లి జొడియా మృతదేహాన్ని తీసుకొచ్చారు. అయితే విద్యుత్ శాఖ వారి నిర్లక్ష్యం కారణంగానే ఒక నిండు ప్రాణం బలైపోయిందని, బాధిత కుటుంబీకులు ఒండ్రాకంచ్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్రమంత్రి పేరుతో కుచ్చుటోపి



భువనేశ్వర్: కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మేనల్లుడినని నమ్మించి పలువురిని మోసం చేసిన యువకుడిని నగర పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు రాహుల్ సాహుగా గుర్తించారు. అతడి చేతిలో మోసపోయిన వ్యక్తులు బుధవారం రాత్రి స్థానిక మాస్టర్ క్యాంటీన్‌లోని ఒక హోటల్‌లో పట్టుకుని నిలదీశారు. అనంతరం అనుమానంతో క్యాపిటల్ ఠాణా పోలీసులకు అప్పగించారు. తనను తాను తాల్చేర్‌కు చెందిన వ్యక్తిగా చెప్పుకుంటున్న రాహుల్ సాహు ఉద్యోగాలు, ఉద్యోగ బదిలీలు, పెట్రోల్ పంపులు, గ్యాస్ ఏజెన్సీల యాజమాన్యం అంటూ పలువురి నుంచి లక్షలు వసూలు చేశాడు. అతను తన సోషల్ మీడియా ఖాతాల్లో కేంద్రమంత్రి, ఒడిశా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో ఉన్న ఫొటోలను పోస్ట్ చేసి అందరినీ నమ్మించి కుచ్చుటోపీ పెట్టాడు. పోలీసులు అతని ఫోన్, కొన్ని నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు, బదిలీ ఉత్తర్వులను స్వాధీనం చేసుకున్నారు.

గిరిజన విద్యార్థులకు గుడ్ న్యూస్

భువనేశ్వర్: రాష్ట్రంలోని గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్ర మంత్రి మండలి ప్రతిపాదిత మాధో సింగ్ చేతి ఖర్చుల యోజనను ఆమోదించినట్లు సభలో గురువారం ప్రకటించారు. ఈ పథకం కింద ప్రతీ గిరిజన విద్యార్థికి చేతి ఖర్చుల కోసం ఏటా రూ.5,000 ఆర్థిక సాయం అందుతుంది. 8వ తరగతి నుంచి 9వ తరగతికి, 10వ నుంచి 11వ తరగతికి ఉత్తీర్ణత సాధించిన గిరిజన విద్యార్థులకు ఈ పథకం లబ్ధి కల్పిస్తారు. ఈ విషయాన్ని సభలో రాష్ట్ర శాసన సభ వ్యవహారాల మంత్రి ముఖేష్ మహాలింగ్ ప్రకటించారు. గిరిజన విద్యార్థుల్లో డ్రాపౌట్ నివారణ ఈ పథకం లక్ష్యంగా పేర్కొన్నారు. సుమారు మూడు లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.156 కోట్ల నిధులు కేటాయించింది.

8న సీఎం సంబల్‌పూర్ పర్యటన

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ రెండు రోజుల పర్యటన నిమిత్తం సంబల్‌పూర్‌కు వెళ్లనున్నారు. ఈనెల 8వ తేదీన వెళ్లి 9వ తేదీన తిరిగి వస్తారు. ఈ సందర్భంగా సీఎం కిషాన్ యోజనను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. సంబల్‌పూర్ ఆరాధ్య దేవత మా సమలేశ్వరిని దర్శించుకోనున్నారు.


నదిలో మహిళ గల్లంతు



నదిలో మహిళ కోసం గాలిస్తున్న దృశ్యం

కొరాపుట్: సుభద్ర యోజన పథకం కోసం పత్రాలు దాఖలు చేయడానికి వెళ్లిన మహిళ నదిలో గల్లంతయ్యింది. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం సమితి ఉమ్రాహండి గ్రామానికి చెందిన హరి బోత్ర సతీమణి ముక్తా బోత్ర అంగి నదిలో పడిపోయింది. ఆమె ఆధార్ కార్డుని అనుసంధానం చేయడానికి భర్తతో కలిసి వెళ్లింది. మార్గ మధ్యలో కాలు జారి నదిలో పడిపోయింది. దీంతో గ్రామస్తుల సమాచారంతో డాబుగాం అగ్నిమాపక సిబ్బంది వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు.


నియమగిరిలో 'మావో' వ్యతిరేక పోస్టర్లు



గోడకు అతికించిన కరపత్రాలు

రాయగడ: జిల్లాలో నియమగిరి పర్వత ప్రాంతాల్లోని పలు కూడళ్లలో మావో వ్యతిరేక పోస్టర్లు, కరపత్రాలు గురువారం వెలిశాయి. ముఖ్యంగా కల్యాణ సింగుపూర్, మునిగుడ పోలీసుస్టేషన్‌ల పరిధిలో ఈ పోస్టర్లు కలకలం సృష్టించాయి. సచేతన డొంగిరియి మంచ్ పేరిట మావో కార్యకలాపాలను వ్యతిరేకిస్తూ పోస్టర్లలో పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా మావోలు తమ ప్రాంతాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తామని ప్రజలను నమ్మించి, స్వార్థపరమైన పనుల్లో నిమగ్నమయ్యారని పోస్టర్లలో ఆరోపించారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో గంజాయి, కలప మాఫియాల నుంచి పెద్ద మొత్తంలో చందాలు వసూళ్లు చేస్తున్న మావోల పనితీరు ఏమాత్రం ఆమోదించదగినది కాదన్నారు. అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న మావోలకు ప్రజలు సహకరించకూడదని కోరారు. కొద్ది నెలల క్రితం సైతం ఇలాంటి పోస్టర్లే దర్శనమివ్వడం గమనార్హం.

కెనాల్‌లో మృతదేహం లభ్యం




కెనాల్ నుంచి బయటకు తీసిన మృతదేహం

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి గురండి పోలీసుస్టేషన్ పరిధి అంకుడు గ్రామంలో గురువారం ఉదయం పీడబ్ల్యూడీ రోడ్డు పక్కన కెనాల్‌లో యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో గురండి ఐఐసీ రబీంద్ర పాత్రో ఆదేశాల మేరకు ఏఎస్ఐ సునందా పాత్రో సంఘటన స్థలానికి వెళ్లి కెనాల్‌లో తేలివున్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరుకు చెందిన శ్యామసుందరరావు(28)గా గుర్తించారు. గురండి ఐఐసీ రబీంద్ర పాత్రో వివరాల మేరకు.. పది రోజుల క్రితం తెంబూరు గ్రామంలోని తన కూతురు ఇంటికి వచ్చినట్లు మృతుడి తండ్రి పి.సూర్యానారాయణ పోలీసులకు తెలియజేశారు. అనంతరం ఒక శుభ కార్యానికి వీరనారాయణపూర్ గ్రామం వెళ్లిన తర్వాత ఆయన ఆచూకీ లభించలేదు. ఇప్పుడు ఇలా మృతదేహం లభించడంతో పోలీసులు కేసు నమోదు చేసి, పలు కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు.

రెవెన్షా పేరు మార్పుపై రచ్చ

భువనేశ్వర్: కటక్ రెవెన్షా విశ్వ విద్యాలయం పేరు మార్పు ప్రతిపాదన శీర్షికగా ఉభయ విపక్షాలు బిజూ జనతా దళ్, కాంగ్రెస్ సభ్యులు గురువారం శాసనసభలో తీవ్రంగా విరుచుకుపడ్డారు. శూన్య గంట సమావేశంలో దీనిపై ముఖ్యమంత్రి వివరణ కోరుతూ నిలదీశారు. అధికార పక్షం సభ్యుల ధోరణిని లెక్క చేయకుండా ముఖ్యమంత్రి వివరణ కోసం విపక్షాల సభ్యులు పట్టుబట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన రెవెన్షా పేరు మార్పు సూచనపై బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే బ్యోమకేష్ రాయ్ ప్రభుత్వం వివరణ కోరారు. అలాగే బీజేడీ శాసన సభ్యుడు శారద జెనా మాట్లాడుతూ కేవలం సంస్థ పేరు మార్చడం ద్వారా విద్యా నాణ్యత, ప్రమాణాలు మెరుగుపడవనే విషయాన్ని గుర్తించి మెలగాలని హితవు పలికారు. రెవెన్షా పేరు మార్పుకు అనుకూలంగా మాట్లాడి కటక్ ప్రజల మనోభావాలను కాషాయ పార్టీ దెబ్బతీసిందని కటక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సోఫియా ఫిర్దౌస్ అన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి సభలో ప్రకటన చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

కలవరపరుస్తున్న పిడుగుపాటు మరణాలు



భువనేశ్వర్: రాష్ట్రంలో పిడుగుపాటు మరణాలు కలవరపరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శాసన సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సమాధానం, లిఖిత గణాంకాల్లో పొంతన లేకపోవడం చర్చనీయాంశమైంది. గత ఐదేళ్లలో పిడుగుపాటు కారణంగా దేశంలోనే అత్యధికంగా 1,103 మరణాలు నమోదయ్యాయని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ పూజారి తెలిపారు. అయితే సభలో ఆయన సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో 1,625 మంది మరణించినట్లు జాబితా సూచిస్తోంది. మయూర్‌భంజ్ సుందర్‌గఢ్, కెంజర్, బాలాసోర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే సమయంలో ఎక్కువ మరణాలు సంభవించాయని మంత్రి వివరించారు. ఏ వేళలో ఎక్కడ పిడుగు పడుతుందో అంచనా వేయడానికి నికరమైన వైజ్ఞానిక ప్రామాణికం, పద్ధతి అందుబాటులో లేదు. పిడుగులు పడే అవకాశం ఉన్న 10 జిల్లాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నితీష్ సాహు రికార్డు



జాజ్‌పూర్ జిల్లా ధర్మశాల మండలం మీర్జాపూర్ పంచాయతీ ఆరంగాబాద్‌కి చెందిన నితీష్ సాహు తైక్వాండోలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2024లో స్థానం సాధించాడు. దీంతో రాష్ట్రానికి, దేశానికి కీర్తిని తెచ్చిపెట్టాడని పలువురు చిన్నారిని అభినందించారు.

- భువనేశ్వర్

క్లుప్తంగా

అంధకారంలోనే రివ్యూ


రివ్యూ మీటింగ్ జరుగుతున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జి అంధకారంలోనే మున్సిపాలిటీ రివ్యూ బుధవారం నిర్వహించారు. మున్సిపల్ ఆఫీస్‌లో అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అకస్మాత్తుగా కరెంట్ పోయింది. అయితే ఆ సమయంలో కార్యాలయంలో కరెంట్ బ్యాకప్ ఇచ్చే యంత్రాలు పని చేయలేదు. దీంతో సెల్‌ఫోన్ల లైట్లలోనే రివ్యూ మీటింగ్ పూర్తి చేశారు.

రాష్ట్ర ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులు

భువనేశ్వర్: దేశవ్యాప్తంగా 82 మంది విద్యాబోధకులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. అవార్డు పొందిన వారిలో ఇద్దరు ఒడిశాకు చెందిన ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో సంతోష్ కుమార్ కొరా, ద్విత్రి చంద్ర సాహు ఉన్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డులను అందజేశారు. ఈ అవార్డు కింద ప్రశంసా పత్రం, రూ.50 వేల నగదు, రజత పతకాన్ని అందజేశారు. సంతోష్ కుమార్ కొరా కలహండి జిల్లాలోని నొర్ల రోడ్డులోని జయ దుర్గా హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు. ద్విత్రి చంద్ర సాహు రాయగడ జిల్లాలోని బిల్లేసు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు.

'విధి నిర్వహణలో అలసత్వంపై చర్యలు'

భువనేశ్వర్: జలవనరుల శాఖ ఇంజినీర్లు, అధికారుల విధుల నిర్వహణపై ఫిర్యాదుల ఆధారంగా ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలను తీసుకుంటుందని శాసన సభలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తెలిపారు. సాలేపూర్‌కు చెందిన బీజేడీ ఎమ్మెల్యే ప్రశాంత్ బెహరా ప్రశ్నకు ముఖ్యమంత్రి సమాధానమిస్తూ జలవనరుల శాఖలో 172 మంది ఇంజినీర్లు, విభాగం అధికారులపై ఆర్థిక అవకతవకలతో సహా వివిధ రకాల ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయని చెప్పారు. ఎమ్మెల్యే అడిగిన మరో ప్రశ్నకు గనుల శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా సమాధానమిస్తూ గనుల శాఖకు చెందిన 32 మంది అధికారులపై క్రమశిక్షణా చర్యలు ప్రభుత్వం పరిశీలనలో ఉందన్నారు.

1280 చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి యోచన

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా వాగులు, చిన్న నదులపై చెక్ డ్యామ్‌లను నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు వ్యవహారాల మంత్రి ముఖేష్ మహాలింగ్ శాసన సభలో తెలిపారు. ఎమ్మెల్యే సిధాంత్ మహాపాత్రో అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2022-25 మధ్యకాలంలో 1,280 చెక్‌డ్యామ్‌లను నిర్మించే ప్రతిపాదన ఉందన్నారు. 2025 నాటికి 585 చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సోఫియా ఫిర్దౌస్ అడిగిన ప్రశ్నకు, కఠాజోడి నది లో నీటిని నిలుపుకోవడానికి బ్యారేజీ నిర్మాణం గురించి చర్చించి పరిశీలించాల్సి ఉందన్నారు.

శ్రమదానం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి కేంద్రం సమీపంలో టురి నది ఒడ్డున ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల స్మారక స్థూపం వద్ద యువకులు గురువారం శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్, పపడాహండి ప్రాంతాల యువకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

వంగర: మండల పరిధి మడ్డువలస జంక్షన్ వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ షేక్‌శంకర్ తెలిపారు. గురువారం అగ్రహారం సమీపంలోని నాగావళి నది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

సభలను విజయవంతం చేయండి

బొబ్బిలి: ఏపీటీఎఫ్ ఆవిర్భవించి, 80 వసంతాలు పూర్తయిన నేపథ్యంలో నిర్వహించనున్న సభలను విజయవంతం చేయాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు బలరామనాయుడు పిలుపునిచ్చారు. ఇదే విషయమై ఆయన స్థానిక పట్టణంలోని టెన్నిస్ కోర్టు వద్ద గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో ఈ నెల 6, 7, 8వ తేదీల్లో, 14వ తేదీన జిల్లా స్థాయిలో సభలు నిర్వహిస్తామన్నారు. ఏపీటీఎఫ్ సభ్యులంతా ఈ సభలకు హాజరై, జయప్రదం చేయాలని కోరారు.

బొబ్బిలి: ఏపీటీఎఫ్ ఆవిర్భవించి, 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ఇండోర్ స్టేడియంలో మండలంలోని ఉపాధ్యాయులకు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు గురువారం నిర్వహించారు. విజేతలుగా ఎస్.జగదీశ్వరరావు, రెడ్డి శ్రీనివాసరావు, అలజంగి చిన్నారావు, బారు వేణులు నిలిచారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


రాయగడ: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


జయపురం: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంను సత్కరిస్తున్న తోటి ఉపాధ్యాయులు


పర్లాకిమిడి: యోగా గురువు బిఘ్నేశ్వర్ దాస్‌ను సత్కరిస్తున్న పతంజలి యోగా సమితి సభ్యులు

రాష్ట్రవ్యాప్తంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. పలుచోట్ల ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. – సాక్షి నెట్‌వర్క్

● ప్రమాణ స్వీకారం


ఒడిశా నుంచి రాజ్యసభకు ఇటీవల ఎంపీగా ఎన్నికైన బీజేపీ అభ్యర్థి మమతా మొహంతా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. భారత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ ఆమెతో ప్రమాణం చేయించారు.
- భువనేశ్వర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


కలిమెల ఆరోగ్య కేంద్రంలో యువకుల మృతదేహాలు



ప్రమాద స్థలంలో ద్విచక్ర వాహనాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 79 పోలీసుస్టేషన్ పరిధి లక్ష్మీపూర్ గ్రామ కూడలి వద్ద గురువారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. కలిమెల సమితి మన్యంకొండ పంచాయతీ పోలేరు గ్రామానికి చెందిన రామ్ పోడియామి, పాండు పోడియామి, శుభో కూంజులు ఒక ద్విచక్ర వాహనంపై కలిమెల నుంచి మన్యంకొండకు తిరిగి వెళ్తున్నారు. అదే సమయంలో లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గేను ఖీలో అనే యువకుడు తమ గ్రామం నుంచి కలిమెల వైపు వస్తున్నాడు. ఈ రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి లక్ష్మీపూర్ జంక్షన్ వద్ద ఢీకొన్నాయి. దీంతో నలుగురు ఎగిరిపడ్డారు. ప్రమాదంలో ఘటన స్థలంలోనే కేను ఖీలో(24), రామ్ పోడియామి(26)లు మృతి చెందారు. పాండు పోడియామికి తీవ్రంగా గాయలవ్వడంతో వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందడంతో ఎంవీ 79 పోలీసుస్టేషన్ ఐఐసీ సుభాష్ కాంర్రకే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గేను ఖిలోకు రెండు నెలల క్రితమే వివాహమైంది. యువకుల మరణ వార్తలతో ఆయా గ్రామాల్లో విషాద వాతావరణం నెలకొంది.

శరవేగంగా సుభద్ర యోజన నమోదు


కొరాపుట్: వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ శుభంకర్ తదితరులు


పర్లాకిమిడి: మాట్లాడుతున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్


రాయగడ: మాట్లాడుతున్న కలెక్టర్ పట్వారి తదితరులు

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సుభద్ర యోజన పథకానికి సంబంధించి నమోదు ప్రక్రియ శరవేగంగా జరుగుతోందని కలెక్టర్ ఫరూల్ పట్వారి అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. జిల్లాలో 4 లక్షల దరఖాస్తులు సిద్ధం చేశామని చెప్పారు. అర్హత గల మహిళలు వాటిని ఉచితంగా పొందవచ్చని వివరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

9 కేంద్రాలు ఏర్పాటు

జయపురం: సుభద్ర యోజన విజయవంతంగా నిర్వహించేందుకు పట్టణంలో 9 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు మున్సిపాలిటీ నిర్ణయించింది. గురువారం మున్సిపల్ సభా గృహంలో జరిగిన కౌన్సిలర్ల సమావేశంలో కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్ వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పట్నాయిక్ మాట్లాడుతూ లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ బి.సునీత తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్‌లో సుభద్ర పథకంపై కలెక్టర్ బిజయకుమార్ దాస్ విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సుభద్ర పథకం విజయవంతంగా అమలు చేయడానికి 7 సమితి కేంద్రాలు, ఒక పురపాలక సంఘం, ఎన్ఏసీ కాశీనగర్, 149 పంచాయతీ కార్యాలయల్లో దరఖాస్తులు ఉచితంగా లభిస్తున్నాయన్నారు. పథకంపై సందేహాలు ఉంటే 14678 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఆయనతో పాటు సుభద్ర పథకం నోడల్ అధికారి గుణనిధి నాయక్ ఉన్నారు.

డబ్బులు వసూలు చేస్తే చర్యలు

కొరాపుట్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సుభద్ర పథకం పేరిట ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రతీ మహిళ తన ఆధార్ కార్డుని బ్యాంక్, మొబైల్ నంబర్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. దీనికోసం ప్రత్యేకంగా 43 ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయనతో పాటు ఎస్పీ రోహిత్ శర్మ, ఏడీఎం నవీన్ చంద్ర నాయక్‌లు ఉన్నారు.

ప్రతీ పంచాయతీలో ఆదర్శ పాఠశాల

● సీఎం మోహన్‌చరణ్ మాఝీ


సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం మోహన్‌చరణ్ మాఝీ

భువనేశ్వర్: స్థానిక లోక్ సేవా భవన్‌లో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ప్రతీ పంచాయతీలో ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తెలిపారు. ప్రతీ పంచాయతీకి ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేస్తామని, అందుకు అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. రాష్ట్ర తొలి విద్యాశాఖ మంత్రి గోదాబరీష మిశ్రా పేరు మీద ఆదర్శ పాఠశాలలకు పేరు పెట్టనున్నట్లు తెలిపారు. దీని కోసం రూ.50 కోట్ల నిధులను బడ్జెట్‌లో కేటాయించినట్లు ప్రకటించారు. గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లోని పిల్లలకు ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన బోధన అందించడం ఈ పథకం లక్ష్యమన్నారు. ఇది కాకుండా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదర్శ పాఠశాలలకు భారీ సంఖ్యలో 27,197 మంది ఉపాధ్యాయులను నియమిస్తామని, 3 నెలల్లో మొత్తం 16,010 మంది జూనియర్ టీచర్లను నియమిస్తామని ప్రకటించారు.

అధ్యక్షుడిగా అమన్ ఉజిబిన్ నాయిక్


అధ్యక్షుడు అమన్ ఉజిబిన్

జయపురం: స్థానిక గగణాపూర్ సేవా పేపరు మిల్లు యునైటెడ్ బిల్ట్ సేవా వర్కర్స్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా అమన్ ఉజిబిన్ నాయిక్ ఎన్నికయ్యారు. ఆయన గత కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా ఉండేవారు. గురువారం 3వ యూనియన్ కార్యవర్గ సమావేశం సేవా పేపరు మిల్లు ప్రాంగణంలో జరిగింది. యూనియన్ సలహాదారు ఉమాచరణ్ పాణిగ్రహి అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. దీనిలో భాగంగా సాధారణ కార్యదర్శిగా మాజీ అధ్యక్షుడు తారాప్రసాద్ ప్రధాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. త్వరలోనే కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటామని వెల్లడించారు.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన

వంగర: మండలంలోని మరువాడ గ్రామంలో జిల్లేడు ద్రావణం తయారీపై గురువారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు మాట్లాడుతూ పంటపొలాల్లో పొటాష్ వినియోగం తగ్గించుకుని, దానికి ప్రత్యామ్నాయంగా జిల్లేడు ద్రావణాన్ని వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లేడు ఆకులు, నీరు, ఆవుమూత్రం వంటివి వినియోగించి జిల్లేడు ద్రావణం తయారు చేసుకోవచ్చని, ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ వి.పోలినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాలు


రాయగడ: విద్యార్థులతో కలెక్టర్ పట్వారి


కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో గీతాలాపన చేస్తున్న దృశ్యం

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో సీఎం విద్యా పురస్కారాలను గురువారం పంపిణీ చేశారు. నబరంగ్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో, ఎస్పీ రోహిత్ వర్మ, ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, మున్సిపల్ చైర్మన్ కును నాయక్ తదితరులు పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వి.కీర్తి వాసన్, ఎస్పీ అభినవ శంకర్, జెడ్పీ ప్రెసిడెంట్ సస్మితా మెలకా, ఎమ్మెల్యే రఘురాం మచ్చో తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి ఉత్తమ విద్యార్థులను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, ఏడీఎం భాస్కరరైతా తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన తప్పనిసరి

● ఎంపీడీఓ చంద్రకళ



ర్యాలీ చేస్తున్న ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ జి. చంద్రకళ అన్నారు. మండలంలోని గుండాలపేట గ్రామంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గ్రామ సందర్శన సభలో ప్రజలకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సత్ప్రవర్తన కలిగి ఉండడం ద్వారా హెచ్‌ఐవీ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. హెచ్‌ఐవీ రోగుల పట్ల వివక్ష తగదని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ మేనేజర్ కె. గౌరి, డాక్టర్ అఖిల, తదితరులు పాల్గొన్నారు.

వరదబాధితులకు మందులు..


సీపీఎం నాయకులకు మందులు అందజేస్తున్న మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు రూ.30 వేల విలువైన మందులు సేకరించి సీపీఎం నాయకులకు గురువారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శంకరరావు, రమణ, శ్రీనివాసరావు, జగన్ మోహనరావు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


నదీ తీరాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సందీప్

వంగర: మండలంలోని కొండచాకరాపల్లి గ్రామం వద్ద సువర్ణముఖి నది వద్ద వరద ఉధృతిని మండల ప్రత్యేకాధికారి కె.సందీప్ గురువారం పరిశీలించారు. రానున్న రోజుల్లో మరో అల్పపీడనం కారణంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు. అనంతరం పునరావాస కేంద్రాల ఏర్పాటుపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దారు డి.ధర్మరాజు, ఎంపీడీవో ఎల్.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సదుపాయం కల్పించండి



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి: మండలంలోని గిరిజన గ్రామాలైన కృపావలస, దీవెనవలస, సియోనువలస, చినఅక్కేనవలసలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని సీపీఐ నాయకుడు ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఇప్పటికీ చాలా గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేవని, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆయా గ్రామాల్లో చాలాకాలంగా విద్యుత్ సదుపాయం లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆ గ్రామాలకు విద్యుత్ వెలుగులు ప్రసాదించాలని కోరారు. దీనిపై విద్యుత్ శాఖ ఏడీఈ సాంబశివరావు మాట్లాడుతూ ఆయా గ్రామాలకు పీవీటీజీ పథకం మంజూరైందని, పనులు మొదలు పెడదామంటే ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. ఫారెస్ట్ అధికారుల నుంచి అనుమతులు వస్తే వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

● ఎస్పీ వకుల్ జిందల్


రామభద్రపురం: మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

రామభద్రపురం: గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ పరిసరాలతో పాటు, రికార్డులను పరిశీలించిన అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. తాను జిల్లాకు బదిలీపై వచ్చిన నెలన్నర రోజుల్లో 29 గంజాయి కేసులు నమోదు చేశామని తెలిపారు. ఒడిశాలోని రాయగడ, సుంకి, పొట్టంగి తదితర ప్రాంతాల నుంచి గంజాయి ఎక్కువగా రవాణా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. చిన్న మొత్తాల్లో గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టుకుని, పెద్ద మొత్తాల్లో సరఫరా చేస్తున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నామన్నారు. అలాగే శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, రౌడీయిజం, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించామన్నారు. దొంగతనాలు జరగకుండా రాత్రి వేళల్లో పోలీస్ బీట్‌లు వేస్తున్నామని, విజిల్స్ వేస్తూ సిబ్బంది రౌండ్‌లు వేస్తున్నారన్నారు. పోక్సో కేసుల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నామని, కేసు నమోదైన వారిపై 60 రోజుల్లో చార్జిషీటు వేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోర్టు తీర్పునివ్వగా, ఏ రాష్ట్ర ప్రభుత్వమూ దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. సైబర్‌నేరాల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ నారాయణరావు, ఎస్‌ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వకుల్ జిందల్ గురువారం సందర్శించి, విలేకరులతో కాసేపు మాట్లాడారు. జిల్లాలో గంజాయి రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, రామభద్రపురం మండలంలోని కొట్టక్కి వద్ద నెల రోజుల క్రితం ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఒడిశా నుంచి గంజాయి తరలించే ముఠాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సతీష్‌కుమార్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.